క్లుప్తంగా

ఎస్పీకి బర్డ్ ఫీడర్ అందజేత



ఎస్పీ జానకీ షర్మిలకు బర్డ్ ఫీడర్ అందజేస్తున్న సామాజిక కార్యకర్తలు

నిర్మల్‌టౌన్: ప్రకృతితో స్నేహం పక్షులకు సహాయం కార్యక్రమంలో భాగంగా సామాజిక కార్యకర్తలు శుక్రవారం ఎస్పీ జానకీ షర్మిలను ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పక్షులకు ఆహారాన్ని అందించే బర్డ్ ఫీడర్‌ను అందించారు. సామాజిక కార్యకర్తలు జక్కుల వెంకటేశ్, రమణ, తదితరులు ఉన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

భైంసారూరల్: మండలంలోని వాలేగాం గ్రామానికి చెందిన జోగుదండే కేశవ్‌రావు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన ఎస్బీఐ జనరల్ ఇన్సురెన్స్‌లో రూ.వెయ్యి చెల్లించి బీమా తీసుకున్నాడు. ఆరునెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా భార్య లక్ష్మికి టీజీబీ ఆర్ఎం డీవీఎస్ రామారావు శనివారం రూ.20 లక్షల బీమా చెక్కు అందించారు. ఎస్బీఐ జనరల్ ఏరియా మేనేజర్ అబ్రహం, దేగాం మేనేజర్ సోని, ఫీల్డ్ ఆఫీసర్ ఉదయ్, అకౌంటెంట్ వెంకగౌడ్, ఎంపీటీసీ మానిక్, మాజీ సర్పంచు శ్యాంరావుపటేల్, బ్యాంకు సిబ్బంది మహేశ్ పాల్గొన్నారు.

సన్మానం



రాజును సన్మానిస్తున్న మిత్రులు

లక్ష్మణచాంద: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నివీర్‌కు మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన రాజు ఎంపికై ఇటీవల ట్రైనింగ్ పూర్తి చేశాడు. స్వగ్రామానికి వచ్చిన ఆయన్ను తండ్రి మహేందర్‌తో చదివిన 1993–94 బ్యాచ్ వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు సన్మానించారు. మిత్రులు బి.సాయన్న, జె.శ్రీనివాస్, పి.సాయన్న, షేక్ హుస్సేన్, కె.శ్రీనివాస్, నాగరాజు, రాములు తదితరులు ఉన్నారు.

‘దూషించానని కేసు పెట్టడం సరికాదు’



మాట్లాడుతున్న ఎంపీపీ అప్కగజ్జారాం

కుంటాల: కుంటాల రైతు వేదికలో సీజనల్ వ్యాధులపై గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎవరిని కించపరిచేలా తాను వ్యాఖ్యలు చేయలేదని ఎంపీపీ అప్క గజ్జారాం పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించాలని గతంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించామని తెలిపారు. రైతువేదికలో దూషించానని వైద్యురాలు శృతిరెడ్డి తప్పుడు కేసు పెట్టడం సరికాదన్నారు. తప్పుంటే న్యాయస్థానంలో ఎదుర్కొంటానని అన్నారు. సమావేశంలో ఎంపీటీసీలు సుధాకర్, కట్ట రవి, మాజీ సర్పంచ్ ఎగ్గం గజ్జారాం, పసుల నవీన్, వెంకట్‌రావు, కొండన్నగారి రమణారావు, చిన్నన్‌రావు, గుద్దేటి కిష్టయ్య, సోమ రాములు, మునీశ్వర్ రాజు, కృష్ణ, బోగ గోవర్ధన్, రమేశ్, సంటెన్న పాల్గొన్నారు.

‘వరల్డ్ విజన్’ సేవలు భేష్



దుప్పట్లు అందజేస్తున్న ఎస్సై సుమలత

లక్ష్మణచాంద: వరల్డ్ విజన్ సేవలు అభినందనీయమని ఎస్సై సుమలత పేర్కొన్నారు. మండలంలోని పీచర గ్రామంలో వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం 220 కుటుంబాలకు రూ.80 వేల విలువ చేసే దుప్పట్లను సభ్యులతో కలిసి పేదలకు పంపిణీ చేశారు. వరల్డ్ విజన్ జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మన్న, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రయాణ ప్రాంగణాలు

- అపరిశుభ్రంగా బస్‌షెల్టర్లు
- చెత్తాచెదారంతో దుర్వాసన
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థలో వాలేగాం బస్‌షెల్టర్

లోకేశ్వరం: ప్రయాణ ప్రాంగణాలు అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం కూర్చోవడానికి సరైన బల్లలు కూడా ఉండటం లేదు. శునకాలు, పందులు, మందుబాబులు, యాచకులకు అవి నిలయాలుగా మారాయి. దీంతో చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉన్నాయి. ప్రచార పోస్టర్లు, కరపత్రాలు అంటించడానికి ఉపయోగపడుతున్నాయి. గ్రామాలకు దూరంలో ఉన్న ప్రయాణ ప్రాంగణాలను నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో దుర్గంధభరితంగా తయారయ్యాయి. పలు ప్రయాణ ప్రాంగణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు కూలిపోతాయేనని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. వీటిని పట్టించుకునే వారే కరువయ్యారు.

రాయపూర్‌కాండ్లీలో దుర్గంధం

రాయపూర్‌కాండ్లీ సమీపంలోని భైంసా–లోకేశ్వరం రహదారిపై బస్‌షెల్టర్‌ను 30 ఏళ్ల క్రితం నిర్మించారు. శిథిలావస్థకు చేరుకుని దుర్గంధభరితంగా మారింది. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పక్కనున్న పెట్రోల్‌బంక్ వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ప్రాంగణాన్ని శుభ్రం చేసిన దాఖలాలు లేవు.

వాలేగాంలో శిథిలావస్థకు..

భైంసా మండలంలోని వాలేగాం బస్‌షెల్టర్‌ను లోకేశ్వరం–భైంసాకు వెళ్లేరోడ్డు పక్కన నిర్మించారు. గ్రామంలో ఎక్కడ ప్రయాణికులు ఉంటే అక్కడే బస్సులు నిలుపుతున్నారు. బస్‌షెల్టర్ వినియోగంలో లేక శిథిలావస్థకు చేరింది. ప్రయాణికులు చెట్ల కింద, దుకాణాల ముందు నిరీక్షిస్తున్నారు. ప్రయాణ ప్రాంగణం యాచకులు, శునకాలకు నిలయంగా మారింది.



వానల్‌పాడ్ బస్టాండ్



వాహనాల పార్కింగ్‌గా లోకేశ్వరం పాత బస్టాండ్

మరుగుదొడ్డి నిర్మించాలి



రాయపూర్‌కాండ్లీ బస్‌షెల్టర్‌లో ప్రయాణికులు వస్తూ వెళ్తుంటారు. మరుగుదొడ్డి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్డి నిర్మించేలా చర్యలు చేపట్టాలి.
– దేవన్న, రాయపూర్‌కాండ్లీ

తాగునీటి సౌకర్యం కల్పించండి



ప్రయాణప్రాంగణంలో తాగునీటి సౌకర్యం లేదు. నీటి కోసం పక్కనున్న హోటల్‌కు వెళ్లాల్సి వస్తుంది. అధికారులు పట్టించుకుని తాగునీటి సౌకర్యం కల్పించేలా చూడాలి.
– సుధాకర్, దేగాం

నేడు విద్యుత్ అంతరాయం

భైంసా: పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు నేపథ్యంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

లక్ష్మణచాంద: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మహేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. మరమ్మతులో భాగంగా వడ్యాల్, మల్లాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శివప్రసాద్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం మరమ్మతు దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

పత్తి పంట పరిశీలన



పరిశీలిస్తున్న ఏఈవో నారాయణ

కుభీర్: మండలంలోని హంపోలి శివారులో పత్తి పంట క్షేత్రాన్ని ఏఈవో నారాయణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 28–28–0తోపాటు డీఏపీ వాడాలని, పంట 20 నుంచి 25 రోజుల మధ్య రసంపీల్చే పురుగు పచ్చదోమ, పెరుబంక, తామర పురుగు ఉంటే దీని నివారణకు తయోమిక్సిన్ క్వినాల్ఫస్ మందు కలిపి పిచికారి చేయాలన్నారు. రైతు అబ్బడి నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

వానాకాలం సాగును ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న డీఏవో అంజిప్రసాద్

కుంటాల: వానాకాలం సాగులో రైతులను ప్రోత్సహించాలని డీఏవో అంజిప్రసాద్ సూచించారు. మండలంలోని కల్లూర్ రైతువేదికలో వ్యవసాయ అధికారులకు శుక్రవారం సాగుపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో పంటపొలాలకు విత్తనం విత్తినప్పటి నుంచి దిగుబడి వచ్చేవరకు ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించాలని కోరారు. రైతులకు అందుబాటులో ఉండాలని అన్నారు. నకిలీ విత్తనాల అమ్మకంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏడీఏ విద్యాసాగర్, భైంసా ఏడీఏ వీణ, ఏవోలు సోమలింగారెడ్డి, రామచందర్ నాయక్, ఏఈవోలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి అటవీ అనుమతి ఇవ్వాలి



ఎంపీ గోడం నగేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న పెంబి నాయకులు

పెంబి: మండలంలోని పస్పుల నుంచి సిరిచెల్మ గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి అటవీ అనుమతి ఇచ్చేలా కృషిచేయాలని ఎంపీ గోడం నగేశ్‌కు పెంబి మండల నాయకులు విన్నవించారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని ఎంపీ నివాసంలో ఆయనకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని యాపగూడ, రాంనగర్, చాక్‌రేవు, వస్పుల్లి, దోందారి గ్రామాలకు వర్షాకాలంలో వాగులు పొంగితే వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామాలకు మట్టి రోడ్డు దిక్కని, పస్పుల వంతెన రెండేళ్ల క్రితం కొట్టుకుపోగా ఇప్పటికి మరమ్మతు చేపట్టలేదన్నారు. గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యంతో కడెం, దోత్తి వాగులపై వంతెనలు నిర్మాణాలకు కృషి చేయాలని ఎంపీని కోరారు. అనంతరం ఎంపీని సన్మానించారు. నాయకులు సుదర్శన్, గణేశ్, రాజు, శ్రీనివాస్, గణేశ్, నరేశ్ ఉన్నారు.

ఎంపీ నగేశ్‌కు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఇటీవల ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందిన గొడం నగేశ్‌ను మండలంలోని బీర్నంది, ఎర్వచింతల్ గ్రామాల బీజేపీ నాయకులు సన్మానించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసి ఖానాపూర్ మండలంలోని గ్రామాల సమస్యలు విన్నవించినట్లు నాయకులు తెలిపారు. గ్రామాలను త్వరలో సందర్శించి సమస్యలు పరిష్కరిస్తానని ఎంపీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. నాయకులు ఎనగందుల రవి, డాగె నరేశ్, కూచన్‌పెల్లి లచ్చన్న, పొలాస వెంకటేశ్, రాజ్ కుమార్ ఉన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ జ్యోతి, మౌనిక

ముధోల్: మండలంలోని ముద్గల్ గ్రామంలో శుక్రవారం మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. మహిళా సాధికారత, సఖీ, చైల్డ్ సర్వీసెస్ గురించి, మహిళా హక్కులు, లింగ వివక్షత గురించి బాలింతలు, కిశోర బాలికలకు మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ జ్యోతి, మౌనిక వివరించారు. పంచాయతీ సెక్రటరీ సలవుద్దీన్, కారోబార్ గణపతిపి, వీవోఏ ప్రశాంత్, అంగన్‌వాడీ టీచర్ స్వరూప, ఆశవర్కర్ ప్రేమలత, ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌సిప్‌నకు విద్యార్థుల ఎంపిక



అర్జున్

తానూరు: మండలంలోని బోరిగాం, భోసి జెడ్పీ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు గాయక్‌వాడ్ అర్జున్, సుంకోల్ల మణికంఠ, ఎ.శివ, కదం గణేశ్, జశ్వంత్ ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌సిప్‌నకు ఎంపికయ్యారు. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో ఎంపికైనట్లు హెచ్‌ఎంలు శంకర్, రాజశేఖర్ తెలిపారు. పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోడె వేదాగ్న, కదం అమరబోధి, కేదేరావు ప్రదీప్, బాయమొల్ల రిశి ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌నకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.కిషన్‌రావు తెలిపారు. వీరికి కేంద్ర ప్రభుత్వం 9వ తరగతి నుంచి ఇంటర్ ఏటా రూ.12 వేల స్కాలర్‌షిప్ అందనుంది.

వర్షం కోసం పూజలు



గోదావరి జలాలను తీసుకుస్తున్న గ్రామస్తులు

కుంటాల: మృగశిర కార్తె ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా వాన జాడలేదు. వర్షం కురువాలని కోరుతూ మండలంలోని అందాకూర్ గ్రామస్తులు శుక్రవారం పూజలు నిర్వహించారు. లోకేశ్వరం మండలంలోని గడ్‌చందా గోదావరి నుంచి జలాలు తీసుకువచ్చి డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామదేవతలకు అభిషేకించారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

భైంసాటౌన్: పట్టణంలోని పురాణ బజార్ రాధాకృష్ణ భవన్‌లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మహేశ్వరి ప్రగతి మండలి ఆధ్వర్యంలో సంఘ మహిళలు, పురుషులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య



నర్సాపూర్ పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు



కుంటాల: విద్యార్థులకు అక్షరాభ్యాసం చేస్తున్న ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద: సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని జెడ్పీటీసీ సభ్యుడు ఓస రాజేశ్వర్ పేర్కొన్నారు. లక్ష్మణచాంద, వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎంలతో కలిసి విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్‌ఎంలు రాజు నాయక్, అశోక్‌వర్మ, ఉపాధ్యాయులు అశోక్, గంగాధర్, గోపాల్‌రెడ్డి, హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు

లక్ష్మణచాంద/ఖానాపూర్: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా లక్ష్మణచాంద మండలంలోని నర్సాపూర్, కనకాపూర్, పీచర తదితర ప్రభుత్వ పాఠశాలలు, ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులతో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం రమాదేవి, పాఠశాల హెచ్‌ఎం మారుతి స్వామి, ఉపాధ్యాయులు కిషన్ తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని లింబా(కె) ప్రాథమిక పాఠశాలలో కొత్తగా విద్యార్థులను చేర్పించారు. శుక్రవారం వారికి అక్షరాభ్యాసాలు చేయించారు. హెచ్‌ఎం గిరినాథ్, ఉపాధ్యాయులు సాయన్న, అనూరాధ, రూమ్ టు రీడ్ కోఆర్డినేటర్ అడ్డిగ రాము, అంగన్‌వాడీ టీచర్లు సువర్ణ, సత్తెమ్మ, పోషకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని ప్రచారం

లోకేశ్వరం: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని లోకేశ్వరం కళాశాల అధ్యాపకుల బృందం సభ్యులు పుస్పూర్, సేవాలాల్ తండా గ్రామాల్లో ఇంటింటా శుక్రవారం ప్రచారం నిర్వహించారు. నిరుపేద విద్యార్థినులు పంగెర శ్రావణి, నాగమణిని కళాశాలలో ఉచితంగా చేర్పించుకున్నారు. విద్యార్థుల కుటుంబ సభ్యులకు రూ.2వేల విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేశారు. జేఎల్ చిన్నయ్య, వెంకటేశ్వర్లు, విఠల్, నవీన్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ ఉన్నారు. లోకేశ్వరం అధ్యాపకుల బృందం సభ్యుడు వినోద్ తదితరుల ఉన్నారు.

కుంటాల: భైంసా గోపాల్‌రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు శుక్రవారం మండలంలోని సూర్యాపూర్, అంబుగామ, మెదన్ పూర్,ఓలా గ్రామాల్లో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కళాశాలల్లో వసతులపై పోషకులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు డాక్టర్ సరస్వతి,అర్చన, మురళి, సుభాష్,రాజు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో గోవింద్

పెంబి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆశలు, అంగన్‌వాడీ టీచర్లు, పలు శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు సిబ్బందితో శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు. ఆశవర్కర్లు ఇంటింటా తిరుగుతూ ప్రజలకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. సమావేశంలో ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో రత్నాకర్‌రావు, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, అధికారులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాలలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం పూజలు నిర్వహించారు. గురుస్వామి కడార్ల హరిప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని కోరుతూ పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.

16న మెగా రక్తదాన శిబిరం

ఖానాపూర్: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పుట్టినరోజు పురస్కరించుకుని ఖానాపూర్‌లో ఈనెల 16న మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు దయానంద్, షబ్బీర్‌పాషా, పట్టణ అధ్యక్షుడు రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. రక్తదానం చేసే యువతీ, యువకులు 15వ తేదీ సాయంత్రం లోగా తమను సంప్రదించాలని సూచించారు.

నేడు ప్రజావేదిక సభ వాయిదా

సోన్: మండలంలో శనివారం నిర్వహించే ఉపాధిహామీ ప్రజావేదిక సభను వాయిదా వేసినట్లు ఎంపీడీవో సురేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. డీఆర్‌డీవో విజయలక్ష్మి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో శనివారం సమావేశం ఉన్నందున వేదికను వాయిదా వేశామని పేర్కొన్నారు. ప్రజావేదిక సభను తిరిగి ఎప్పుడు నిర్వహించేది తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

భైంసాటౌన్: పట్టణంలోని పురాణబజార్‌కు చెందిన విశ్వనాథ్(50) చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. సీఐ డి.రాజారెడ్డి కథనం ప్రకారం.. స్థానిక గోశాల గోవులను మేత కోసం తీసుకెళ్లి గురువారం సాయంత్రం తిరిగి గోశాలకు వస్తుండగా బైక్ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలు కాగా, స్థానికులు ఏరియాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య లక్ష్మిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

కుంటాల: బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని భైంసా రూరల్ సీఐ నైలు అన్నారు. భైంసా సీఐగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శుక్రవారం కుంటాల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఏఎస్సై రాందాస్ ఉన్నారు.